ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

అంగన్‌వాడీలకు నోటీసులు..

- ఇళ్ల వద్ద లేకుంటే కుటుంబసభ్యులకు అందజేత
- వారు తీసుకోవడానికి నిరాకరిస్తే తలుపులకు తగిలిస్తున్న ఐసిడిఎస్ సూపర్ వైజర్లు
- విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశం



మార్టూరులో అంగన్‌వాడీ ఇంటికి నోటీసు తగిలిస్తున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

సిఎం జగన్ ఇచ్చిన హామీల అమలు కోసం నెల రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐసిడిఎస్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. అంగన్‌వాడీల ఇళ్లకు వెళుతున్నారు. అంగన్‌వాడీలు అక్కడ లేకుంటే వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేస్తున్నారు. వారు తీసుకొనేందుకు అంగీకరించకపోతే ఇంటి తలుపులకు తగిలిస్తున్నారు. విధులను, బాధ్యతలను విస్మరించినందుకు విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో పది రోజుల్లో ▶ 2లో

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

3లో ▲

దర్శి ఇన్‌ఛార్జిగా బూచేపల్లి

వైసిపి అధిష్టానం ప్రకటన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో



దర్శి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని అధిష్టానం ప్రకటించింది. గురువారం రాత్రి ప్రకటించిన మూడో జాబితాలో జిల్లా నుంచి ఆయన ఒక్కరి పేరు మాత్రమే వచ్చింది. 2009లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన 2014లో జరిగిన ఎన్నికల్లో ప్రతికూల ఫలితాన్ని చూశారు. 2004లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి తర్వాత కాంగ్రెసు పార్టీలో చేరి వైఎస్ కుటుంబానికి అత్యంత ఆత్మీయుడిగా మారారు. తర్వాత ఆయన ▶ 2లో

'ఎంపీ అభ్యర్థి' తేలే వరకు

వేచి చూద్దాం..

- మాజీ మంత్రి బాలినేని ఆలోచన ఇదే..
- రెండు రోజులు ఆగండంటూ అనుచరులకు సూచన



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు ఎంపీ అభ్యర్థిని ప్రకటించే వరకూ వేచిచూడాలనే ఆలోచనలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉన్నారు. అప్పటివరకూ తొందరపడి ఏ నిర్ణయానికీ రాకూడదని భావిస్తున్నారు. తన సన్నిహితులకు ఇదే చెబుతున్నారు. ఇప్పటికే మాగుంటకు సీటు విషయంలో అధిష్టానం నిర్ణయం తేలిపోయింది. ఆఖరు నిమిషంలో ఏమైనా మార్పు ఉంటుందా? అనే మీమాంసలో ఉన్నారు. మూడు రోజులు విజయవాడలో ఉన్నా అధిష్టానం నుంచి ఎటువంటి పిలుపులేకపోవడంతో తీవ్ర అసంతృప్తితో హైదరాబాద్ వెళ్లిపోయిన బాలినేని భవిష్యత్ వ్యూహంపై దృష్టి సారించారు. ఏం చేయాలనే దానిపై తర్జన భర్జనలోనే ఉన్నారు. సిఎం జగన్ తీరుపై ఆయన మనస్తాపంతో ఉన్నారు. మాజీ మంత్రి బాలినేనితో పాటు ఎంపీ మాగుంట పరిస్థితి కూడా ఇదే.. ఇద్దరికీ పార్టీలో ప్రాధాన్యతపై ఇప్పుడు సాగుతున్న చర్చలు తెలిసినవే. సిఎం జగన్ నుంచి సానుకూలత లేదు. బాలినేని రెండు కీలకమైన ఎజెండాలకు స్పందన లేదు. కనీసం పిలిచి కూడా మాట్లాడలేదనే భావనలో బాలినేని ఉన్నారు. అధిష్టానం పెద్దల తీరుపై కలత చెందిన ఆయన వెంటనే హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. దీంతో బుధవారం రాత్రి విడుదల కావాల్సిన మూడో జాబితాను కూడా వాయిదా వేశారు. ఇక బాలినేని భవితవ్యంపై పలు రకాలుగా ఊహాగానాలు సాగుతున్నాయి. తెరచాటున సాగే ▶ 2లో

వేచి చూద్దాం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారాలపై రెండు పార్టీల్లో ఉత్కంఠగానే కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనా చర్చలు సాగుతున్నాయి. అయితే బాలినేని మాత్రం ఎంపీ అభ్యర్థి విషయం తేలేవరకూ వేచిచూడాలనే ఆలోచనలో ఉన్నారు. నియోజకవర్గం నుంచి, జిల్లాలో వివిధ నియోజకవర్గాల నుంచి ఫోన్లు చేసిన నేతలకు ఇదే చెబుతున్నారు. అసెంబ్లీ జాబితాలతో పాటు ఎంపీ అభ్యర్థిని కూడా రేపోమాపో ప్రకటిస్తారనే భావనలో బాలినేని ఉన్నారు. మాగుంటకు ఇవ్వలేమని ఇప్పటికే తేల్చేశారు. ఇదే విషయాన్ని బాలినేని కూడా పార్టీలోని తన సన్నిహితులకు చెబుతున్నారు. చివరి ఆశగా అభ్యర్థిని ప్రకటించే వరకూ చూడాలనే ఆలోచనలో ఉన్నారు. మాగుంటకు కాకుండా వేరే వ్యక్తికి ప్రకటిస్తే అపుడు ఏ నిర్ణయం తీసుకోవాలన్న దానిపై అందరితో చర్చించి అప్పుడు నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో బాలినేని ఉన్నారు. వెంటనే ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తారా? కొంత సమయం తీసుకుంటారా? అనేదీ చూడాలి. ఒంగోలు పార్లమెంటు బరిలో ఇప్పటివరకూ వైవి.సుబ్బారెడ్డి కుటుంబం నుంచి ఉంటారని భావించారు. ఇప్పుడు ఆయన రాజ్యసభకు వెళుతున్నందున కొత్త నేతను పరిశీలిస్తున్నట్లు సమాచారం. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేరు కూడా సిఎం జగన్ పరిశీలనలో ఉంది. ఇప్పటికిప్పుడు ఎంపీ అభ్యర్థిని ఖరారు చేస్తారా? అనే చర్చలు సాగుతున్నాయి. కొత్తవారిని పెట్టే ఉద్దేశం ఉంటే వెంటనే ప్రకటిస్తారని చెబుతున్నారు. దీనిపై రేపోమాపో తేలిపోతుందని సమాచారం. ఇక బాలినేని అసెంబ్లీ వ్యవహారం కూడా తేలాల్సి ఉంది. బాలినేనిని గిద్దలూరు వెళ్లాలని సిఎం జగన్ సూచించారు. ఆ నిర్ణయమే జరిగితే ఇప్పుడు సమన్వయకర్తల పేరుతో విడుదల చేసే జాబితాల్లో ఉంటుంది. సిట్టింగులను కొనసాగిస్తే మాత్రం జాబితాల్లో రావు. బాలినేని మాత్రం ఒంగోలులోనే పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఏదేమైనా ఎంపీ అభ్యర్థి విషయం తేలే వరకూ రాజకీయంగా కొత్త నిర్ణయాలు ఏమీ కనిపించేలా లేవు. పార్టీలు వీడతారనే ప్రచారం తీవ్రంగా ఉన్నా వాటికి స్పష్టత రావడానికి కొంత సమయం పట్టేలా ఉంది.

దర్శి ఇన్‌ఛార్జిగా 'బూచేపల్లి'

(మొదటిపేజీ తరువాయి)

తన కుమారుడు శివప్రసాద్‌రెడ్డి రాజకీయ అరంగేట్రం చేశారు. ఈ కుటుంబం నుంచీ తండ్రీకొడుకులు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి మరణంతో పాటు కొన్ని ప్రత్యేక కారణాల రీత్యా 2019 ఎన్నికల్లో శివప్రసాద్‌రెడ్డి పోటీ చేయలేదు. దర్శిలో పార్టీ కోసం పనిచేశారు. దీంతో జడ్పీ ఎన్నికల్లో ఈయన తల్లి బూచేపల్లి వెంకాయమ్మకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు ఆమె జడ్పీ ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. మార్కాపురం నుంచి దాదాపుగా ఖరారైనట్లుగా భావించిన జంకె వెంకటరెడ్డి పేరు ఆఖరు నిమిషంలో ఆగినట్లు తెలుస్తోంది.

నేడు 'ఆత్మీయ పరిచయం'

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని కామేపల్లి రోడ్డులోనున్న శ్రీ సీతారామ కల్యాణ మండపంలో కొండపి నియోజకవర్గ స్థాయి ఆత్మీయ పరిచయ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల నాయకులు తెలిపారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు , వైసిపి రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలు ఎంపీ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, సోషల్ జస్టిస్ జూపూడి ప్రభాకర్, వైసిపి వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని ఆరు మండలాలు ఎంపిపిలు, వైస్‌ఎంపిపి, జడ్‌పిటిసిలు, సర్పంచులు, రాష్ట్ర స్థాయి నాయకులు, మండల స్థాయి నాయకులు, సచివాయల కన్వీనర్లు సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలోని మిని స్టేడియం, పివిఆర్ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో కలిసి ఆటలు ఆడి వారిని ఉత్సాహపరిచారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు కనుమరుగు కాకుండా పల్లెపెల్లెనా, ప్రతి పట్టణంలో అన్నీ రకాల క్రీడలు నిర్వహించడమే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఈ క్రీడా పోటీల ద్వారా అనేక మంది క్రీడాకారులు తమలోని క్రీడా సామర్థ్యాలను బయటపెడుతున్నారని తెలిపారు.

కొత్తపట్నం : కొత్తపట్నంలోని జడ్‌పి హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపిడిఒ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, మోటుమాల పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, పల్లెపాలెం పంచాయతీ కార్యదర్శి మణిదీప్, గమండ్లపాలెం పంచాయతీ కార్యదర్శి బాలాజీ, కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శి అల్లయ్య, పిఇటిలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి : స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ క్రీడా పోటీలలో కె.ఉప్పలపాడు సచివాలయం టీమ్ విన్నర్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రత్నప్రభ, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నాం



క్రికెట్ ఆడుతున్న ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్

ఆడుదాం ఆంధ్రలో అపశృతి

యర్రగొండపాలెం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజివారిపల్లి, మిల్లంపల్లి గ్రామాల టీముల మధ్య కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా గంజివారిపల్లి గ్రామానికి చెందిన యాతం కృష్ణారెడ్డి కాలుకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, ఇఒఆర్‌డి ఈదుల రాజశేఖర్‌రెడ్డి హుటాహుటినా యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి వైద్యులు కాలు విరిగినట్లు తేల్చారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు.

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రతి వ్యక్తికీ ఇతర అవయవాల కన్నా కంటిచూపే ప్రధామని సర్పంచి మన్నం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కారుమంచి గ్రామంలో ఎల్‌వి ప్రసాద్ ఐఇన్ స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 42 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 14 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమైనట్లుగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ క్షేత్ర సహాయకులు నంబూరి సుధీర్ కుమార్, విజన్ టెక్నీషియన్ షేక్ రెహమాన్, నాయకులు మన్నం నారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నోటీసులు..

(మొదటిపేజీ తరువాయి)

వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

మార్టూరు అంగన్‌వాడీ సిబ్బందికి పర్చూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభద్ర ఆదేశాల మేరకు సూపర్‌వైజర్లు షోకాజ్ నోటీసులు జారీచేస్తున్నారు. మూడు పేజీల నోటీసులో ప్రాజెక్ట్, సిబ్బంది పేరుతో పాటు ప్రాంతం కోడ్ వంటి వివరాలు ఉన్నాయి. ఉద్యోగ నిబంధన ఉల్లంఘన, తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సంజాయిషీ కోరడం.. అంటూ షోకాజ్ లో పేర్కొన్నారు. సిబ్బంది సమ్మెకు వెళ్లినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలు, సమ్మె వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కలుగుతున్న ఇబ్బందులతో పాటు అనేక అంశాలను ఇందులో పేర్కొన్నారు. మొత్తం 12 పాయింట్లతో ఈ నోటీసులను ఐసీడీఎస్ అధికారులు జారీ చేశారు. గత నెల 12 నుండి విధులకు దూరంగా ఉన్నారని, ప్రభుత్వం పొందుపరిచిన విధులను,బాధ్యతలను విస్మరించినందుకు విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో నోటీసు అందిన పది రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ పేర్కొన్నారు. తగిన సమయంలో వివరణ ఇవ్వకపోయినట్లయితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. షోకాజ్ నోటీసులు జారీ చేసి భయభ్రాంతులకు గురిచేసినా తమ డిమాండ్లు పరిష్కారించే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పెరికల రేఖ ఎలిజబెత్ స్పష్టం చేశారు.

మార్కాపురం రూరల్: మార్కాపురంలోనూ అంగన్‌వాడీలకు ఐసిడిఎస్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంగన్‌వాడీల ఇళ్లకు నోటీసులు అంటించారు. డిమాండ్లను పరిష్కరించమని అంగన్వాడీలు సమ్మెలోకి వెళ్తే వారిపై ఎస్మా ప్రయోగిస్తారా.? అని సిపిఎం నాయకులు దగ్గుపాటి సోమయ్య, సిఐటియు నాయకులు గుమ్మా బాలనాగయ్య, పి.రూబిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు చేపట్టిన నిరసనకు మద్దతు తెలుపుతూ అంగన్వాడీలు నిర్వహిస్తున్న రిలే దీక్షలో నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలు విధుల్లోకి చేరకపోతే తొలగిస్తామంటున్నారని, ఇదే జరిగితే నీ ప్రభుత్వం ఎక్కడ ఉంటుందో ఒకసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు.

నాగులుప్పలపాడు: మండలంలోని అంగన్‌వాడీల ఇళ్ల వద్ద ఐసిడిఎస్ సిబ్బంది గురువారం షోకాజ్ నోటీసులు అంటించారు.

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

- మరో బాలుడిని కాపాడిన స్నేహితులు

- పాతగోళ్లవిడిపి గ్రామంలో ఘటన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈఘటన యర్రగొండపాలెం మండలం పాత గోళ్లవిడిపి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నార్ణపాటి శివాంజి (8), నార్ణపాటి నాగసాయి (9), మరో బాలుడు, ఇద్దరు బాలికలు స్నేహితులు. పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంటి వద్దే ఉన్నారు. ఆడుకొనేందుకు పొలానికి వెళ్లారు. రేగిచెట్లకు ఉన్న కాయలు కోసుకున్నారు. దాహం వేయడంతో బొమ్మనబోయిన ఏడుకొండలు నీటి కుంట దగ్గరకు వెళ్లాడు. నీరు తాగేందుకు నార్ణపాటి శివాంజి, నార్ణపాటి నాగసాయి, మరో బాలుడు ఉకుంటలో దిగారు.



శివాంజి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



నాగసాయి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ముగ్గురు ప్రమాద వశాత్తు జారి నీటిలో పడిపోయారు. ఒడ్డున ఉన్న బాలికలు ఓ బాలుడిని అతి కష్టం మీద పైకి లాగారు. మిగతా ఇద్దరు కుంటలో మునిగిపోయారు. బాలికలు కేకలు వేయడంతో చుట్టు పక్కల పొలాలో ఉన్న వారు అక్కడి వచ్చారు. నీటిలో పడిన వారిని బయటకు తీశారు. అప్పటికే వారు చనిపోయారు. నీటి కుంటకు కంచె ఏర్పాటు చేయకపోవడం మూలంగానే ముక్కు పచ్చలారని చిన్నారులు మృతి చెందారని గ్రామస్తులు ఆరోపించారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఐ వై.నాగరాజు తెలిపారు. స్థానిక చాణిక్య జూనియర్ కళాశాలలో 8వ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదవాలన్నారు. కొండపి-2 ఎంఇఒ రామారావు మాట్లాడుతూ యుక్త వయస్సులో ఉన్న విద్యార్థులు ప్రలోభాలకు లోనుకారాదని సూచించారు. అనంతరం 2023 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి ఎంఇఒ బి.నాగేంద్రవదన్, బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అద్యక్షుడు పర్రె వెంకట్రావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -మద్దిపాడు

మండల పరిధిలోని దొడ్డవరం గ్రామంలోని పరుచూరు నరసింహయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 28 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలిసి అప్పటి గుర్తులను ఒకరితో నొకరు పంచుకొని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. వారి అపురూప సందేశాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు బి. సీతారామయ్య, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కె.సుబ్బారావు, సామాన్య శాస్త్ర ఉపాధ్యాయుడు జి.రామచంద్ర రావు, హిందీ ఉపాధ్యాయుడు బి. వెంకట రత్నం, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు వి.రామస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుడు యు.పోలయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

సంక్రాంతి పండుంగ సందర్భంగా కోడిపందాలు, పేకాట తదితర జూదాలు నిర్వహించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బ్రహ్మనాయుడు హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు.

వృద్ధులకు అన్నదానం

కనిగిరి : సినీ హీరో మహేష్ బాబు నటించిన గుంటూరు కారం ఈనెల 12న విడుదల అవుతున్న సందర్భంగా మహేష్ బాబు అభిమానులు స్థానిక గార్లపేట రోడ్డులోనున్న వద్ధాశ్రంలోని వద్ధులకు అన్నదానం నిర్వహించారు. పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వద్ధాశ్రమ నిర్వాహకులు అన్నా రంగనాయకులు, మహేష్ బాబు అభిమానులు మనోజ్, సుబ్బారావు, రాజు,నరహరి, జలాలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకుండా

ప్రజల వద్దకు ఎలా వెళ్లాలి : ఎంపిపి

ప్రజాశక్తి -కనిగిరి

గ్రామాల్లో ఎలాంటి పనులూ చేయకుండా ప్రజల వద్దకు ఏం మోహం పెట్టుకొని వెళ్లాలని ఎంపిపి దంతులూరి ప్రకాశం ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దంతులూరి ప్రకాశం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. మొత్తం 14 మంది ఎంపిటిసిలకు గానూ ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైస్ ఎంపిపిలు ధనుంజయ్, తిరుపతి రెడ్డి, బలిపల్లి, చీరలదిన్నె ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. 25 మంది సర్పంచులకు గానూ కేవలం జమ్మలమడక, ఏరువారిపల్లి, గుడిపాడు, వాగుపల్లి సర్పంచులు మాత్రమే హాజరు అయ్యారు. విద్యాశాఖ, ఆర్డబ్ల్యుఎస్, ఐసిడిఎస్, ఐకెపి, పిఆర్, హెల్త్, ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏ పనులు చేయకుండా ఏ మొహం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్లాలో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరైతే



మాట్లాడుతున్న మడతల కస్తూరి రెడ్డి

ఏమి చర్చించాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. చీర్లదిన్నె ఎంపిటిసి అట్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ జరగడం లేదన్నారు. జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుందో సమాచారం అందించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హౌసింగ్ సహకార సంఘంలో అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం రూరల్ హౌసింగ్ సహకార సంఘంలో అక్రమాలు జరుగుతున్నట్లు బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై విచారణ నిర్వహిస్తున్నారు. వేమూరి విశ్వనాథశర్మ అనే వ్యక్తి గతంలో కొందరు సభ్యులతో కలిసి గృహనిర్మాణ సహకార సంఘం ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే నేటి విశ్వనాథపురం ఏర్పడింది. సుమారు 88 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమి సహకార సంఘం ఆధీనంలో ఉంది. విశ్వనాథశర్మ మరణం తరువాత కంభాలపాడు గ్రామానికి చెందిన మంచికంటి వెంకట రామకృష్ణ వరప్రసాద్ అధ్యక్షుడిగా చలామణి అయ్యాడు. తరువాత గోనుగుంట్ల కిరణ్ కుమార్ అనే వ్యక్తి తనకు తానే అధ్యక్షుడిగా చెప్పుకుంటూ చెలామణి అవుతున్నాడు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఈ భూమిపై కొందరు వ్యాపారులు, రాజకీయ నాయకుల కన్నుపడింది. ప్రస్తుతం అధ్యక్షుడిగా చలామణి అవుతున్న వ్యక్తితో పాటు పాత అధ్యక్షుడు ప్రసాద్, ఒంగోలు సూపర్ మార్కెట్ ఎమ్‌డి జి. కుమార్ పొదిలి గృహనిర్మాణ సహకార సంఘానికి డివిజనల్ అధికారిగా చెప్పుకుంటూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్లు బాధితులు అరోపించారు. సంఘం పేరుతో వెనుకటి తేదీలతో ఫోర్జరీ సంతకాలతో రసీదులు ఇస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. గుంటూరు హనుమంతరావు తండ్రి వెంకటస్వామికి 10-03-2010 తేదీతో ప్లాట్‌కు రశీదు ఇచ్చారు.అదే



నిరసన తెలుపుతున్న బాధితులు

ప్లాట్‌కు 01-10-2010 తేదీలో గుంటూరు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మరొక రశీదు ఇచ్చారు. ఒకేసర్వేనెంబర్‌లో నకిలీ రశీదులు ఇస్తుండటంతో వీరి భాగోతం వెలుగులోకి వచ్చింది.దళారులు తమను బ్లాక్ మెయిల్ చేసి లక్షలాది రూపాయలు వసూలు చేశారని బాధితులు స్థానిక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విచారణకు వచ్చిన జిల్లా కోపరేటివ్ బ్యాంక్ డివిజనల్ అధికారి సాయినాథ్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజులుగా ఒంగోలు సహకార సంఘం డిఆర్ సాయినాథ్ విచారణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బాధితులు సాయినాథ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్ సాయినాథ్ విలేకరులతో మాట్లాడుతూ సహకార సంఘం అధ్యక్షుడి పేరుతో అక్రమాలకు పాల్పడిన గొనుగుంట్ల కిరణ్ కుమార్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్, ఒంగోలు డిఆర్‌గా ప్రచారం చేసుకున్న కుమార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - పంగులూరు.

ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన భగవాన్ రాజుపాలెం-రామకూరు గ్రామాల మధ్య బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జనకవరం గ్రామానికి చెందిన కనుమూరి సునీల్ (37) శివాలయం పనులకు కోసం కంకరు తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌తో రామకూరు వస్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి రహదారిపై గుంతలు ఉన్నాయి. ఈ నేపత్యంలో గుంతల్లో ట్రాక్టర్‌ను అదుపు చేయలేక సడన్ బ్రేక్ వేశాడు. దీంతో సునీల్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో ట్రాక్టర్ సునీల్‌పై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సంతమాగులూరు

టివిఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి మృతిచెందాడు. ఈఘటన మండల పరిధిలోని కొమ్మాలపాడు బస్టాండ్ సెంటర్ వద్ద అద్దంకి-నార్కెట్ పల్లి రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కొమ్మాలపాడు గ్రామానికి చెందిన ఇనిమెళ్ళ పెద్ద సైదా (55) మృతిచెందాడు. మృతుడు టివిఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని టోల్ గేట్ అంబులెన్స్‌లో నరసరావుపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మతి చెందాడు. ఎస్ఐ ఎవి. శివకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

వార్డు కమిటీలతో సమావేశం

పొదిలి : రాష్ట్రంలోని వైసిపి పాలనకు చరమ గీతం పాడాలని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందులనారాయణ రెడ్డి తెలిపారు. పట్టణంలోని 1, 2, 4, 10, 11, 12 వార్డుల బూత్ కమిటీలు, వార్డు కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యుల పాల్గొన్నారు.

టిడిపి మండల కమిటీ సమావేశం

ప్రజాశక్తి -అర్ధవీడు

రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నాగులవరం గ్రామంలో టిడిపి మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్నారని తెలిపారు. వైసిపి అవినీతి దుర్మార్గపు పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్, ప్రధాన కార్యదర్శి కొణతం రంగారెడ్డి, క్లస్టర్ యూనిట్, ఇన్‌ఛార్జులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని ఎల్లుపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన మిరప పంటనుఉద్యాన శాఖ అధికారి విష్ణుప్రియ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిర్చికి తామర పురుగు వైరస్ తెగుళ్లు ఎక్కువగా ఆశించినట్లు తెలిపారు. వాటి నివారణకు ఎకరా పొలానికి 20 చొప్పున పసుపు బులుగు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలన్నారు. నీటిలో వేప నూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎసిఫేట్ 1.5 గ్రా , స్పైనో సైడ్ 25 మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది మహమ్మద్ నూర్ ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉరితాళ్లతో అంగన్‌వాడీల నిరసన



భూ హక్కు చట్టం జిఒ రద్దు చేయాలని లాయర్ల దీక్షలు

చట్టం రద్దు చేసే వరకు పోరాటం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూమి హక్కుల యాజమాన్య చట్టం జీఓ నెం.512ను రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద గురువారం 2వ రోజు కొనసాగాయి. రిలే నిరాహారదీక్షల్లో న్యాయవాదులు కూర్చున్నారు. భూమి హక్కుల చట్టం లోపభూయిష్టంగా ఉందన్నారు. ఈ చట్టం సామాన్య ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉందని, దీనిని ప్రభుత్వం రద్దు చేయవలసిన వసరం ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భీమా లీలాకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఆర్య

ఎంఇఒకు వినతి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

సంక్రాంతి సెలవుల్లో కొన్ని పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంఇఒ నిరంజన్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. సంక్రాంతి సెలవులు ఇవ్వని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 9నుండి 17వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డిఇఒ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సెలవు ఇవ్వకుండా విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. పండుగ సెలవులు విద్యార్థులకు చాలా సున్నితమైన అంశమని, విద్యార్థుల మానసిక పరిస్థితి దృష్ట్యా సెలవులు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంతు ఓ-2 జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు జనరల్ బాడీ సమావేశం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నేడు మండల సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఆర్ఎం రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి బండారు అనూష అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు హాజరు కావాలని కోరారు


బాపట్లలో ఉరి తాళ్లతో అంగన్‌వాడీల నిరసన దర్నా


పర్చూరు మండలం చెరుకూరు సెంటర్‌లో నోటీసులు

ప్రజాశక్తి - బాపట్ల

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ వైఖరికి నిరసనగా అంగన్‌వాడీలు గురువారం ఉరి తాళ్ళకు వేలాడుతూ నిరసన తెలిపారు. 31వ రోజుకు చేరిన సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలు రాత్రి జాగారం చేసేందుకు నిశ్చయించారు. సమ్మె నేపథ్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన 24గంటల రిలే నిరాహార దీక్ష 5వ రోజుకు చేరింది. బాపట్ల ప్రాజెక్టు అంగన్‌వాడీలు ఎం తిరుమల, కె వల్లూరమ్మ, టి శివపార్వతి ,కె అశ్విని, వై రాహేలు. భట్టిప్రోలు ప్రాజెక్టు అంగన్‌వాడీలు ఎం యోహాన్ కుమారి, బి రూపారాణి దీక్షలో కూర్చున్నారు. సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తప్పు పట్టారు. శిబిరంలో జెవివి నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి విప్లవ గీతాలు ఆలపించి అంగన్‌వాడీల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, డీసీసీ నియోజకవర్గ అధ్యక్షుడు కొచ్చర్ల వినయ్ రాజు, విసికె పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖరరావు, కెవిపిఎస్ నాయకుడు కె శరత్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు గుదే రాజారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, భోగిరెడ్డి తిరుమలరెడ్డి, సమాజ వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు కోటయ్య, సిఐటియు సీనియర్ నాయకులు కె నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. సమ్మెలో అంగన్‌వాడీ అధ్యక్షురాలు శైలశ్రీ, సీతామహాలక్ష్మి, హేమమాలిని, లత, గీత, శ్రీలత పాల్గొన్నారు.

అద్దంకి : అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి తిరుపతిరెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు 31వ రోజు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి నప్పటికీ పోరాటానికి నిలబడ్డారని అన్నారు. సమస్య పరిష్కరించే వరకు సమ్మె కొనసాగు తుందని అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షులు జి శారద అన్నారు.

రేపల్లె : అంగన్‌వాడిల సమ్మెలో భాగంగా ఒంటికాలు మీద నిల్చుని దండం పెడుతూ కొంగజపం రూపంలో నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 31వ రోజు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ నటిస్తుందని అన్నారు. మహిళా పక్షపాత ప్రభుత్వం అంటూ అంగన్‌వాడీలను అణిచివేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ షోకాజు నోటీసులు ఇస్తుందని అన్నారు. బెదిరింపులకు పాల్పడుతుందని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడు తూ అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమ్మె నివారిం చాలని కోరారు. అంగన్‌వాడీ పోరాటాన్ని అణిచి పెట్టాల నుకుంటే మరింత పట్టుదలతో ప్రభుత్వంపై పోరాడడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎన్ కృష్ణకుమారి, జ్యోతి, వై మేరీమణి, శ్రీలత, రజిని, నిర్మలజ్యోతి, జయప్రద పాల్గొన్నారు.

కొల్లూరు : అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడి వర్కర్స్ గురువారం రోడ్డుపై సంక్రాంతి సంబరాల సందడి చేస్తూ ముగ్గులు వేసి జగనన్న తమవైపు చూడన్నా, ఎస్మా వద్దు, జీతాలు పెంచు అనే నినాదాలతో రంగవల్లులు అద్దారు. సిఐటియు జిల్లా నాయకులు జి సుధాకర్, సిఐటియు నాయకులు బి సుబ్బారావు, అంగన్‌వాడీ లీడర్స్ బాల, కాశి, సౌభాగ్య లక్ష్మి, భాగ్యం, ఆదిలక్ష్మి, నగరాజకుమారి పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఒంటి కాలుపై నిలబడి వేడుకుంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన ధర్నా నిర్వహించారు. మహిళలన్న జ్ఞానం కూడా ఈ ప్రభుత్వానికి లేదని సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు అన్నారు. షో కాజ్ నోటీసులతో భయభ్రాంతులకు గురి చేస్తే భయపడేది లేదని అన్నారు. సిఐటియు నాయకులు ఎం డేవిడ్, బి చినదాసు, రైతు సంఘం ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని చెరుకూరులో అంగన్‌వాడీ కేంద్రాల్లో షో కాజ్ నోటీసులు అంటించారు.

భట్టిప్రోలు : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలో అంగన్‌వాడీలు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం, నోటీసులు ఇవ్వటం హేయమైన చర్యని సిఐటియు కార్యదర్శి జి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సత్యనారాయణ, నాగరాజు ఉన్నారు.

చీరాల : అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి తహశీల్దారు వరకు ర్యాలీ నిర్వహించారు. కెవిపిఎస్ కార్యదర్శి ఎల్ జయరాజ్, జనసేన నాయకులు జీ శివరామప్రసాద్, హైకోర్టు అడ్వకేట్ మధుగారు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబూరావు, ఎం శంకర్, ఆంజనేయులు, జి సురేష్, చెంచయ్య, సుకన్య, ఐవి ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల మొండి వైఖరితో రాష్ట్ర నాయకత్వం ఉందని సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు అన్నారు.

చెరుకుపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తలు ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. న్యాయమైన తమ సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించి బలవంతంగా నిరసనలను అణచే ప్రయత్నం మానుకోవాలని, జీతాలు పెంచాలని కోరారు.

కారంచేడు : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు గురువారం ఆందోళన చేశారు. అక్కడే మధ్యాహ్నం భోజనాలు చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆందోళన విరమించేది లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి - బాపట్ల


రౌండ్ టేబుల్ సమావేశంలో సిహెచ్ గంగయ్య

అంగన్‌వాడి కార్యకర్తలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గపుచర్య ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల భవనంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఎం సీనియర్ నాయకులు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధన కోసం పోరాడుతున్న కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారం చూపకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన హామీలు అమలు చేయకపోతే అంగన్‌వాడీల సత్తా ఏంటో నిరూపిస్తారని అన్నారు. నల్లమడ రైతు సంఘం నాయకులు నింగామిడేలు విజయ్ కుమార్, బిఎస్పి నియోజకవర్గ అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, సమాధి వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటానికి అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో వీసీకే పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖరరావు, కెవిపిఎస్ నాయకుడు కె శరత్, బిఎస్పి నియోజకవర్గ అధ్యక్షులు వినయ్ రాజు, సిఐటియు నాయకులు తిరుమలరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు గుదే రాజారావు, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు పి కోటయ్య, కె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన విశాఖ, చెన్నై జట్లు



విశాఖ, చెన్నై జట్ల మధ్య హోరాహోరీ పోరు

ప్రజాశక్తి - మేదరమెట్ల

రావినూతల గ్రామంలో జరుగుతున్న శ్రీ భ్రమర సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్లో గురువారం జరిగిన మ్యాచ్‌లో చిక్కోలు షీట్స్ వైజాగ్, సౌత్ జోన్ సిసి చెన్నై జట్లు సెమీస్‌కు చేరాయి. ఉదయం జరిగిన మ్యాచ్లో సిక్కోలు చీట్స్ వైజక్, యూవాన్ ప్రాపర్టీస్ హైదరాబాద్ జట్లు తలపడగా చిక్కోలు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన యువాన్ ప్రాపర్టీస్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 8వికెట్లను కోల్పోయి 176పరుగులు చేసింది. అనంతరం సిక్కోలు జట్టు 19.3ఓవర్లలో మూడు వికెట్లను మాత్రమే కోల్పోయి 177పరుగులు చేసి ఏడు వికెట్ల విజయాన్ని సాధించింది. జట్టులో వినయ్ 42బంతులకు 62పరు గులు చేసి అర్ధ సెంచరీ నమోదు చేశాడు. మధ్యాహ్నం జరిగిన సౌత్ జోన్ సిసి, కోకా ఇన్ఫ్రా హైదరాబాద్ జట్టు తలపడగా సౌత్ జోన్ సిసి జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 20ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 160 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన కోకా ఇన్ఫ్రా హైదరాబాద్ జట్టు 93.3ఓవర్లలో 140పరు గులను మాత్రమే చేసి ఆల్ అవుట్ అయింది. దీంతో సౌత్ జోన్ సిసి జట్టు గెలుపొంది సెమీస్‌కి అర్హత సాధించింది. నేడు ఉదయం థండర్ బర్డ్ తిరుపతి వర్సెస్ మెగా వారియర్ విజయవాడ జట్లు తలపడనున్నాయి. మధ్యాహ్నం లైన్ క్రికెట్ క్లబ్ బెంగళూరు జట్టు ప్రసాద్ స్పోర్ట్స్ హైదరాబాద్ జట్టు తలపడ నున్నాయి.

బెంగళూరు జట్టుపై జార్ఖండ్ జట్టు విజయం

ప్రజాశక్తి - పంగులూరు


రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్

మండలంలోని కొండమంజు లూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో గత మూడు రోజులుగా జరుగు తున్న జాతీయ స్థాయి క్రికెట్ టి20 పోటీలు గురువారం రస వత్తరంగా జరిగాయి. మస్తాన్ లెవెన్ ఝార్ఖండ్, మజ్హర్ లెవెన్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్లో మొదట టాస్ గెలిచిన ఝార్ఖండ్ జట్టు, నిర్ణీత 20 ఓవర్లకు 10వికెట్లు కోల్పోయి 191పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన బెంగళూరు జట్టు 12.5 ఓవర్లలో ఆల్ అవుట్ అయ్యి 126పరుగులు చేసింది. బెంగళూరు జట్టుపై ఝార్ఖండ్ జట్టు 65పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్లో జార్ఖండ్ జట్టుకు చెందిన అనికోటి దాని 30బంతుల్లో 60పరుగులు, రితీష్ 19 బంతుల్లో 35పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. అదే జట్టుకు చెందిన హరీష్‌రెడ్డి 3ఓవర్లు బౌలింగ్ చేసి 26 పరుగులు ఇచ్చి, నాలుగు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కి ఎంపిక య్యాడు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్, ఎంఎకె క్రికెట్ క్లబ్ బెంగళూరు, ఒంగోలు బుల్స్ జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్ లో మొదట టాస్ గెలిచిన బెంగళూరు జట్టు నిర్ణీత 20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఒంగోలు బుల్స్ జట్టు 18 ఓవర్లకే ఆల్ అవుట్ అయ్యి 134పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు ఒంగోలు జట్టుపై 121పరుగులు తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బెంగళూరు జట్టుకు చెందిన ఒక క్రీడాకారుడు సెంచరీ చేయగా, మరొకరు హాఫ్ సెంచరీ చేసి ప్రత్యర్థి బౌలర్లకు చెమటలు పట్టించారు. బాలు బాలుకు సిక్స్ లు ఫోర్లు కొడుతూ తాహ అనే క్రీడాకారుడు 47బంతు ల్లో104పరుగులు చేసి జట్టుకు తిరుగులేని విజయాన్ని అందించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కు ఎంపికయ్యాడు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంగన్‌వాడీలను పండుగ పూట రోడ్డున పడేయటం అన్యాయమని రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ నాయకులు వాసుదేవరావు విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఒంగోలు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరింది. గురువారం నాటి సమ్మెలో యర్రగొండపాలెం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు. దీక్షలను ప్రారంభించిన వాసుదేవరావు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టి ఆదరించే అంగన్‌వాడీలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు.



అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న తమిళనాడు ఎంపీ మాణిక్యం ఠాగూరు

కాంగ్రెస్ పార్టీ మద్దతు

అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నేతలు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, తమిళనాడు పార్లమెంట్ సభ్యులు మాణిక్యం ఠాగూర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు నెలవేతం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హిట్లర్ పరిపాలన కాకుండా ప్రజా పాలన చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు కాంపియా, మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్ రెడ్డి, నగర అధ్యక్షురాలు దాసరి నాగలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంగన్‌వాడీల సంఘీభావం ప్రకటిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జివి. కొండారెడ్డి, యూనియన్ జిల్లా నాయకురాలు కెవి.సుబ్బమ్మ, ప్రశాంతి, హేమీమా, నిర్మల జ్యోతి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న ఎస్‌కె.మాబు

దర్శి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు తిరుపతమ్మ, ప్రశాంతి, నాగమణి, రంగమ్మ, ఫాతిమా, వెంకటరమణ, విశ్వవాణి, సుబ్బమ్మ, లక్ష్మీదేవి, నాయకులు పంటా ఏడుకొండలు, తాండవ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ హెచ్చరించారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు రమేష్ మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమ్మెలకు సిఐటియు నాయకులు డికెఎం.రఫీ, గుమ్మా బాలనాగయ్య, ఎఐటియుసి నాయకులు చెన్నయ్య, రామయ్య, ఒంగోలు ఒంగోలు పార్లమెంట్ అంగన్ వాడీల సంఘం అధ్యక్షురాలు ఉప్పలపాటి నాగేంద్రమ్మ, ప్రధాన కార్యదర్శి మెహరున్నీసా, యర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్షురాలు రమణమ్మ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు మల్లేశ్వరి, సుభాషిణి, నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బలు, సునీత, అరుణ, జయమ్మ, నాగరాజకుమారి, సుబ్బులు, పాల్గొన్నారు.



యర్రగొండపాలెంలో మాట్లాడుతున్న ఎం. రమేష్

పెద్ద దోర్నాల : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లా డుతూ తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నార. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరీ కుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొండపి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించక పోతే సమ్మెను ఉధృత్తం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు హెచ్చరించారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటి యు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ యూని యన్ నాయకులు పి.క్రాంతి జయప్రద తదితరులు పాల్గొన్నారు.



కొండపిలో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

గిద్దలూరు రూరల్ : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను వెంటనే పరిష్కరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయలక్ష్మి ,లక్ష్మీదేవి, వరలక్ష్మి, రహమద్ బి , సిఐటియు నాయకుడు టి.ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారావు, కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిసికేశవరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పట్టని వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు క్రాంతి, జయప్రద,నాయకులు సుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌందర్య,రామ సుబ్బులు, డివైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర, ఐద్వా నాయకులు బషీరా, శాంత కుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

హనుమంతునిపాడు : అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం అంగన్‌వాడీల సమ్మెలకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు నారాయణ, కెవిపిఎస్ నాయకుడు కత్తి ఏబు, డివైఎఫ్ఐ నాయకుడు కెసి. రామయ్య, ఉపాధి కూలీల సంఘం నాయకుడు కత్తి మత్తయ్య, గ్రామీణ వైద్యుల సంఘం నాయకుడు వినయ్, పాల్గొన్నారు.

వెలిగండ్ల : అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కర్కించాలని అంగన్‌వాడీలు నెల రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటనపల్లి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య, టంగుటూరు, మద్దిపాడు, వెలిగండ్ల ప్రాజెక్టుల అధ్యక్షులు క్రాంతి, జయప్రద, యక్కంటి రాధమ్మ, దొడ్డ హైమావతి, కోటపాటి సుధారాణి, మద్దిరాల భాగ్యలక్ష్మి, వేశపోగు విమలమ్మ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా వారిని బెదిరింపులకు గురిచేస్తూ తలుపులకు షోకాజ్ నోటీసులు అంటించడం దుర్మార్గమని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.మాబు విమర్శించారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ అంగన్ వాడీలపై ఎస్మా ప్రకటించడం దారుణమని తెలిపారు. అంగన్‌వాడీలకు అన్ని ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు మద్దుతు పలుకుతున్నట్లు తెలిపారు. సిఐటియు నాయకులు జి. బసవపున్నయ్య, టిఎన్‌టియు నాయకులు చుండూరి వెంకటేశ్వర్లు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకట సుబ్బమ్మ , దుర్గాభవాని, రమ అరుణ, రజనీ, కల్యాణి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు మెడకు ఉరితాడు తగిలించుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు బంకా సుబ్బారావు మాట్లాడుతూ అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం వివిధ రూపాలలో నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు పల్లాపల్లి ఆంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఎన్. ధనలక్ష్మి, నాయకులు నిషా, రాధ రజిని,కోమలి, సౌజన్య, మీరాభి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మద్దిపాడులో మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరిసంహారెడ్డి

వైసిపికి చరమగీతం పాడాలి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ జగన్ పాలనలో ఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరన్నారు. పతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పారని ఆ ఊసే లేదన్నారు. యువతకు ఉపాధి కరువైందన్నారు. కనిగిరిలో నిర్వహించిన రా కదలిరా బహిరంగ సభను జయప్రదం చేసినందుకు ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మను బోయిన వెంకటేశ్వర్లు, ఎన్‌సి.మాల కొండయ్య, మన్నేపల్లి శీను, ఉప సర్పంచి వెంకటనరసయ్య, దేవాండ్ల తిరుపతయ్య, ఆర్ఎంపి వైద్యుడు రమేష్, రేనాటి వెంకటేశ్వర్లు, దాసరి మల్లికార్జున, తోకల మాల్యాద్రి, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, బండారు వెంకటరామయ్య, కొత్త తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



జంకె వెంకట రెడ్డితో తాటిపర్తి చంద్రశేఖర్

'జంకె'ను కలిసిన తాటిపర్తి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని వైసిపి యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వైసిపి యర్రగొండపాలెం ఇన్‌ఛార్జిగా త్వరలో బాధ్యతలు తీసుకుటున్న నేపథ్యంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని చంద్రశేఖర్ కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో పార్టీ స్థితిగతుల గురించి వారిద్దరూ కాసేపు చర్చించుకున్నారు.

వ్యాపారులపై జిఎస్‌టి భారాలు

కొండపి ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి పాలనలో చిన్న వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారుల వరకూ తీవ్రంగా నష్టపోయారని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శింగరాయకొండలోని ట్రంక్‌రోడ్డు బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ రహదారికి ఇరువైపుల ఉన్న దుకాణాలదారులతో మాట్లాడి వారి కష్ట నష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వ్యాపారులపై మోయలేని భారాలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపు రెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, షేక్ సనావుల్లా, షేక్ సందానీ బాషా, ఇమ్మడిశెట్టి రామారావు, కాక శ్రీనివాసరావు, షేక్ యస్‌దాని, షేక్ అబ్దుల్ సుభాన్, సుదర్శి ప్రసాదరావు, శీలం చంటి, కళ్ళగుంట నరసింహ, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సల్మా, ఓలేటి రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ప్రభుత్వం


జగనన్న తోడు చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా


చెక్కు విడుదల చేస్తున్న ప్రకాశం కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చిరు వ్యాపారులు, సంప్రదాయ వత్తిదారులకు జగనన్న తోడు పథకం ఎంతో అండగా నిలుస్తుందని కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. "జగనన్న తోడు" పథకం కింద నగదు పంపిణీని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి సిఎం జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా గురువారం బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు స్థానిక కలెక్టరేట్‌లో చెక్కు రూపంలో కలెక్టర్ రంజిత్ బాషా, బాపట్ల ఎంఎల్‌ఎ కోన రఘుపతి చేతుల మీదుగా అందజేశారు. జగనన్న తోడు పథకం కింద గతంలో లబ్ధి పొందిన మహిళలకు వడ్డీ రాయితీ సొమ్ము రూ.60.20లక్షలను నేరుగా 24,953మంది మహిళల బ్యాంకు ఖాతాలకు విడుదల చేసిందన్నారు. అలాగే ఎనిమిదో విడత కింద జగనన్న తోడు పథకం ద్వారా 12,042మంది మహిళల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.12.74కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి సిహెచ్ కృష్ణ, ఎల్‌డిఎం శివకృష్ణ పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్ : సంప్రదాయ వత్తిదారులు, చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తోడుగా ఉంటోందని కలెక్టర్ ఐఎస్ దినేష్ కుమార్ తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. లబ్ధిదారులకు రుణాల పంపిణీ, వడ్డీ రాయితీకి సంబంధించిన బ్యాంకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎనిమిదవ విడతలో జిల్లాలో 18,166 మందికి రూ.19.22 కోట్ల రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ విడతలో 24,171 మంది లబ్ధిదారులకు రూ.46.95 లక్షల వడ్డీ రాయితీ జమ చేస్తున్నామన్నారు. మొత్తంగా జిల్లాలో 79,043 మంది లబ్ధిదారులు (యూనిక్) రెగ్యులర్‌గా రుణం పొందు తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు అన్ని విడతలలో కలిపి 1,94,867మందికి రూ.197.5కోట్ల రుణాలను పంపిణీ చేశామన్నారు. అన్ని విడతలలో కలిపి 2,18,460 మందికి రూ.4,70 కోట్ల వడ్డీ రాయితీ లభించిందన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాధవి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ కుమార్, డిఆర్‌డిఏ పీడీ టి వసుంధర, మెప్మా పీడీ టి రవికుమార్ పాల్గొన్నారు.


అధికారుల సమీక్ష సమావేశంలో జెసి సిహెచ్ శ్రీధర్

సంస్కృతి ఉట్టిపడేలా సంక్రాంతి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈనెల 12న కలెక్టరేట్ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రాంగణాన్ని సుందరంగా తయారు చేయాలని చెప్పారు. ఉద్యోగులకు క్రీడా పోటీలను, మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలను నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి కృష్ణ, డ్వామా పిడి అర్జున్, డిఎం అండ్ హెచ్‌ఒ విజయమ్మ, గృహనిర్మాణశాఖ పిడి ప్రసాదు, ఎస్ఇ హరి నారాయణ, పౌరసరఫ రాలశాఖ డిఎస్‌ఒ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


వాగోలు శ్రీనివాసరావుకు నివాళి అర్పిస్తున్న మంత్రి

వాగోలుకు ఘన నివాళి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త వాగోలు శ్రీనివాసరావు (62) గుండె పోటుతో మరణించారు. ఆయన మృత దేహానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట మాజీ ఎంపీపీ పి పద్మారావు, సర్పంచ్ టి కృష్ణమోహన్ పాల్గొన్నారు.



బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రజాశక్తి - బాపట్ల

బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించి, బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని కార్మిక శాఖ అధికారి రాజా పాల్సన్ అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బాల కార్మికులు పనిచేసే అనుమానిత ప్రాంతంలో తనిఖీలు చేయాలని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు షాపు యజమానులకు వివరించారు. కె చక్రవర్తి, డి చంద్రశేఖరరావు, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ డి రాము, మహిళా శిశు విభాగం అధికారి పి ప్రసాదరావు, రోజ్ కిషోర్, నాగరాజు, డి నాగమణి, మహిళా పోలీసు బి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంతకాల సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పంకి మద్దతుగా సంతకాల సేకరణను వైసిపి ఇన్చార్జి పానెం హనిమిరెడ్డి మొదటి సంతకాన్ని చేశారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కె అనంతలక్ష్మి, గుంటూరు మాధవరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆదర్శనీయుడు : కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై సాంఘిక సంక్షేమ సాధికారత శాఖ, డిఆర్‌డిఏ అధికారులు గురువారం కలెక్టరేట్‌లో ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన చిత్రాల ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పి రంజిత్ బాషా, శాసనసభ్యులు కోన రఘుపతి ఘనంగా నివాళ లర్పించారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉండడం రాజ్యాంగ ద్వారానే సాధ్యమని కలెక్టర్ చెప్పారు. ఇష్టంగా చదువు కుంటే ఎంత ఉన్నత స్థాయికి ఎదగవచ్చో అంబేద్కర్ చేసి చూపారన్నారు. విద్యావేత్తగా రాజ్యాంగాన్ని రూపొందించే డ్రాఫ్టింగ్ కమిటీకి చైర్మన్ గా వ్యవహరించారని తెలిపారు. దేశానికి మార్గ నిర్దేశకులుగా చరిత్రలో నిలిచిపోయారని కీర్తించారు. ఆయన చేసిన కృషి నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే సిఎం జగన్ మోహన్ రెడ్డి బలహీన వర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుం టున్నారని శాసనసభ్యులు కోన రఘుపతి చెప్పారు. ఆర్థిక సమానత్వం కొరకు రాష్ట్ర సిఎం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేలా కార్య క్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంబే ద్కర్ స్మృతి వనాన్ని నిర్మించడం చారిత్రాత్మక ఘట్టమ న్నారు. డిఆర్‌ఒ పి వెంకట రమణ, ఎస్‌సి వెల్ఫేర్ అధికా రిని జె రాజాదిబోరా, డిఆర్‌డిఏ పీడీ సిహెచ్ కృష్ణ, డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ ఎస్ విజయమ్మ, డిఎస్‌ఒ విలియమ్స్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, వైసీపీ నాయకులు ఐ మాల్యాద్రి, ఎస్సీ సంఘాల నాయకులు చారువాక, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


ఫోటో గాలరి తిలకిస్తున్న ఎంఎల్‌ఎ రఘుపతి, కలెక్టర్


సమీక్ష సమావేశంలో ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్

అవినీతిపరులను పోషిస్తున్న జగన్

ప్రజాశక్తి - పంగులూరు

జగన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతిపరులు, అసమర్థులు, నేరస్తుల్ని పెంచి పోషిస్తున్నాడని ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. జొన్నతాళిలోని తన అతిథి గృహంలో కోరిసపాడు, పంగులూరు మండలం చిన్న మల్లవరం గ్రామాల బూత్ ఇన్చార్జులు, పేజీ నేస్తం సభ్యులతో సమీక్షించారు. భస్మాసురుడి లా జగన్ మొత్తం రాష్ట్రాన్నే విధ్వంసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర భివృద్ధి కోసం పనిచేయాల్సిన ముఖ్యమంత్రే అంధకారంలోకి నెట్టేశాడని ఆరోపించారు. అధికారంలోకి రాగానే తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా జీతం ఇస్తానని అంగన్‌వాడీ మహిళలకు ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఆశ చూపి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ అమలు చేయాలని నెలకుపైగా సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రిలో చలనం లేకపోగా ఎస్మా ప్రయోగించడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈనెల 5న కనిగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు మోగించిన శంఖారావం రా..కదలిరా పేరుతో చేపట్టిన తొలి సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు.

సంతమాగులూరు : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు సమీపంలోని తన అతిథి గృహంలో మక్కెనవారిపాలెం బూత్ ఇన్ చార్జిలు, పేజీ నేస్తం, టిడిపి శ్రేణులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. వివిధ అంశాలపై సమీక్షించారు. 20వ తేదీలోపు భవిష్యత్తుకు గ్యారెంటీ నమోదు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గాడిపర్తి వెంకటరావు, గొట్టిపాటి చౌదరిబాబు, సిహెచ్ వాసురెడ్డి, తేలప్రోలు రమేష్, కొనికి శ్రీనివాసరావు, ధూపాటి ఏసోబు, మాదాల సుబ్బారావు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ బాలురు, బాలికల జట్టు ఎంపిక చేయడం జరిగిందని ఎంపికల కమిటీ సభ్యులు, పిడి కత్తి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. ఈనెల 20న నంద్యాలలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. సెలక్షన్ కమిటీ నిర్వాహకులుగా స్టేట్ కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి, ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ ఆర్గనైజేషన్ సెక్రటరీ మంతెన సుబ్బరాజు, పీఈటి బి రాధాకృష్ణ, నేషనల్ ప్లేయర్ పూల నాగులు, నాగరాజు ఉన్నారు. ఈనెల 16నుంచి 20వరకు స్థానిక మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్‌లో శిక్షణ తరగతులు ఉంటాయని అన్నారు.


ఎంపికైన కబడ్డీ జట్టు

భస్మాసుర పాలనకు స్వస్తి: ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రానున్న ఎన్నికల్లో భస్మాసురుడు జగన్ పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, టిడిపి - జనసేన ప్రభుత్వంతో రాష్ట్రానికి స్వర్ణయుగం రానుందని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. జగన్ పాలనపై ప్రజలతో పాటు సొంత పార్టీ ఎమ్మెల్యేలు సైతం ధిక్కారస్వరం వినిపిస్తున్నారని అన్నారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో అన్ని సీట్లు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేసారు. ఎన్టీఆర్ కలలు కన్న పేదరికం లేని సమాజమే లక్ష్యంగా చంద్రబాబు పథకాలకు రూపకల్పన చేశారన్నారు. రా కదలి రా కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి వైసిపిలో వణుకు మొదలైందని అన్నారు. రానున్న టిడిపి పాలనలో పరిశ్రమలకు మంచి రోజులు వస్తాయని అన్నారు. భారీ పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత టిడిపి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.


ఎంఎల్‌ఎ ఏలూరి

గ్రూప్-2పై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

జెవివి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశాలు మండలంలోని వెదుళ్లపల్లి చైతన్య భవన్లో గురువారం ప్రారంభించారు. గ్రూప్2 ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. జెవివి సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కె అబ్రహం, ఆసోది శంకర్, డి నిర్మలమ్మ, పి రాజ్యం, పి రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, మిర్యాల సుబ్బారావు, ఉషారాణి, అక్షర దీప్తి, శచింత కిరణ్ కుమార్, లోకేష్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల


బాపట్ల డిఎస్పి వెంకటేశులు

సంక్రాంతి పండుగ ను పురస్కరించుకొని కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని డిఎస్పి టి వెంకటేశులు హెచ్చరించారు. ఆయన ప్రజాశక్తితో గురువారం మాట్లాడారు. సంక్రాంతి పండుగ వేడుకలను సంప్రదాయంగా జరుపుకోవాలని అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కోడి పందాలు, ఇతర జూదం నిర్వహించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా కోడిపందేలు, పేకాట, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా జూదం ఆడితే ఆయా స్టేషన్ల పరిధి లోని రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేస్తారన్నారు. కోడి పందాలు, జూదం ఆడుతున్నట్లు తెలిస్తే 100లేదా 112 నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని అన్నారు. సంక్రాంతి సంబరాల్లో యువత క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలు నిర్వహించుకోవచ్చని అన్నారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

పంగులూరు : సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడలనే పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రేణింగవరం ఎస్ఐ కెకె తిరుపతిరావు హెచ్చరించారు. కోడి పందాలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని విలేకర్ల సమావేశంలో చెప్పారు. సంతోషంగా కుటుంబాలతో పండుగ జరుపుకోవాలని కోరారు.ఐ

స్కాన్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

డిఎం,హెచ్ఒ డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పిసిపిఎన్‌డిటి చట్టంలో రిజిస్టర్ అయిన డయాగ్నోస్టిక్ స్కాన్ సెంటర్లు, ఆసుపత్రులు క్రమం తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన పిసిపిఎన్‌డిటి చట్టంపై సమావేశం జరిగిందన్నారు. రెన్యువల్ చేయకపోతే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ రద్దు చేసి సీల్ వేస్తామన్నారు. సమావేశంలో ప్రగతి నర్సింగ్ హోమ్, కందుల ఓబుళరెడ్డి ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. కార్యకములో ఎన్‌సిడి నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరధి, డాక్టర్ నాగార్జున, డాక్టర్ సువర్ణ రాజు, సర్డ్స్ ఎన్జీఒ లక్ష్మి పాల్గొన్నారు. జిల్లాలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామంటే ఎవరి ప్రలోభాలకు గురై మోసపోవద్దని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి వేరొక ప్రకటనలో తెలిపారు.

గాలికుంటు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

గాలి కుంటు వ్యాధి పట్ల పశు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖా సహాయ సంచాలకులు డాక్టర్ టి శంకరరావు అన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. గాలి కుంటు వ్యాధి గురించి వివరించారు. పశువుల నోటికి, కాళ్ళకు, గిట్టలకు కురుపులు వస్తే అది గాలి కుంటు వ్యాధిగా గుర్తించవచ్చని అన్నారు. వైరస్ వల్ల గాలి కుంటు వ్యాధి వస్తుందని తెలిపారు. వ్యాధి సోకిన పశువు లాలాజలం గడ్డపై పడుతుందని, ఆ గడ్డి మేసే ఇతర పశువులకు సంక్రమిస్తుందని తెలిపారు. జనవరి 2నుంచి 31వరకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. బలవర్ధకమైన ఆహారం అందించాలని తెలిపారు. రాగి జావ, ఉలవలు, పచ్చి గడ్డి ఆహారంగా పెట్టాలని తెలిపారు. నోటిలో పుండ్లు ఉండటం వలన ఎక్కువ ఘన పదార్థాలు తినవని, ద్రవ పదార్థాలు అందించాలని తెలిపారు. పశు వైద్యశాలల్లో అన్ని మందులు ఉచితంగానే, అందుబాటులో ఉన్నాయని డాక్టర్ శంకరరావు తెలిపారు.

కోలాహలంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రకాశం, బాపట్ల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మండలంలోని వంకాయలపాడు శ్రీ సాయిరాం గురుకుల పాఠశాల ఆవరణలో కోలాహలంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో 20జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఆదర్శ స్కూల్ కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ బహుమతులు అందజేశారు. హై స్కూల్ స్థాయిలో కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్ర భాస్కరరావు పోటీలను ప్రారంభించారు.

ఆక్రమణలను అడ్డుకుంటాం : హనిమిరెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి


భూములు పరిశీలిస్తున్న హనిమిరెడ్డి

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ యదేచ్ఛగా సాగుతుందనే ప్రచారం ఎక్కువగా ఉందని, ప్రభుత్వ స్థలాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తామని వైసిపి ఇన్చార్జ్ పి హనిమిరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను ఆయన పరిశీలించారు. సింగర కొండ సమీపంలోని కుంట భూములను చదును చేస్తు న్నారని, తద్వారా ఆక్రమించు కొనేందుకు ప్రయత్నిస్తు న్నారని సమాచారం అందడంతో రెవిన్యూ, మున్సిపల్ అధికారులతో ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమిని కాపాడుకునేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భూములను ఆక్రమించుకునే వారి పట్ల సంబంధిత అధికారులు పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే క్రిమినల్ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుకునేందుకు స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట ఫెన్సింగ్ ఏర్పాటు చేయటానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని తాసిల్దార్‌కు సూచించారు. గురుకుల పాఠశాల ప్రక్కన జర్నలిస్టుల కేటాయించిన స్థలాలను పరిశీలించారు. ఐదు ఆరుగురికి ఇంకా ఇంటి స్థలాలు రావాల్సి ఉందని, వాటిని కూడా ఇప్పించాలని జర్నలిస్టులు ఆయన ద్రుష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించాలని తాసిల్దార్‌కు సూచించారు. టిడ్కో గృహాలకు అవసరమైన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు అర ఎకరం భూమి కావలసి ఉందని, ప్రస్తుతం 20సెంట్లు మాత్రమే ఉందని సంబంధిత బాద్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూమి ఉందని, దానిని సబ్ స్టేషన్ కేటాయించాలని తాసిల్దార్ సుబ్బారెడ్డిని ఆదేశించారు. ఇసుక, మట్టి ప్రస్తుతం సరఫరా ఆగిపోవడంతో ఇంటి నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు ఆయన దృష్టికి తీసుకురాగా ప్రభుత్వంతో మాట్లాడి తగిన అనుమతులు తీసుకునేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మేడగం గోపాలరెడ్డి, కోట శ్రీనివాసకుమార్, కన్నెబోయిన వీరయ్య, కౌన్సిలర్లు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చేనేతల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

రాష్ట్ర చేనేత జన సమైక్య ఆరోపణ

ప్రజాశక్తి - వేటపాలెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో చేనేత పరిశ్రమ రోజు రోజుకి కుంటుపడుతుందని చేనేత జన సమైక్య నాయకులు ఆరోపించారు. మండలంలో చల్లారెడ్డిపాలెం పంచాయితీ కొంజేటి నగర్ కాలనీలో గత రాత్రి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న లేళ్ల విజయలక్ష్మి మరణం కలచి వేసిందని పేర్కొన్నారు. చేనేత రిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు రోజువారి పని లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చేనేత కార్మికులు ఆర్థిక సమస్యలు, అనారోగ్యాలతో సతమతం అవుతూ జీవనాన్ని గడుపుతున్నారని అన్నారు. కరోనా మహమ్మారి సంక్షోభం తర్వాత కార్మికులకు పని చేసే శక్తి, నైపుణ్యం కలిగి ఉన్నప్పటికీ రోజు వారీ పని లేక కుటుంబ పోషణకు అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారని అన్నారు. అప్పులు తీర్చే పరిస్థితిని వృత్తి భరోసాను ప్రభుత్వాలు కల్పించకపోవడంతో ప్రత్యామ్నాయం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. దేశాయిపేట పంచాయతీ పృద్వి సుజాత గత ఏడాది జూన్ 3న, రామానగర్‌కు చెందిన కౌతరపు జ్యోతి జూన్ 07న మగ్గానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. దేశాయిపేట పంచాయతీ ఐటిఐ కాలనీకి చెందిన పెద్ద చెన్నయ్య, సుబ్బలక్ష్మి దంపతులు జులై 17న రైలు క్రిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆ దంపతులు ఇద్దరు కలిసి ఒక్కరిగానే మరణించడం ఆవేదన కలిగించింది. వీటిని మరవక ముందే కొణిజేటి నగర్ చేనేత కార్మికురాలు లేళ్ళ విజయలక్ష్మి అప్పుల బాధ తట్టుకోలేక, అప్పులు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక జనవరి 09న మగ్గానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని ఆత్మహత్యకు గురైందని తెలిపారు.


కరపత్రం విడుదల చేస్తున్న చేనేత నాయకులు

ఐలవరంలో నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తీ -భట్టిప్రోలు


సచివాలయం ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున, ఎంపి మోపిదేవి

మండలంలోని ఐలవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం1, ఆరోగ్య భవనాన్ని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు గురువారం ప్రారంభించారు. సభకు సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో ఎంపి రమణారావు మాట్లాడుతూ ఐలవరం గ్రామానికి వైసీపీ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. సంక్షేమ పాలనతో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేసే విధంగా నూతన భవనాలను మంజూరు చేసిందని అన్నారు. వీటిని పూర్తిస్థాయిలో ఐలవరం వినియోగించుకుందని అన్నారు. ఈపాటికే సచివాలయం2 భవనం గత ఏడాది పూర్తి చేసుకునే ప్రారంభించి కార్యకలాపాలు కొనసాగిస్తుండగా మరో సచివాలయ భవనం, వెల్నెస్ సెంటర్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. రైతు భరోసా కేంద్రం పూర్తిచేసి రైతులకు చేరువ చెయ్యాలని సూచించారు. మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి ఐలవరం ప్రజలు తన వెంట ఉండి తనను ముందుకు నడిపించారని అన్నారు. వారికి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. తాను ఓడిన, గెలిచిన మైలవరం ప్రజలను మరువలేనని అన్నారు. ప్రభుత్వ భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఎన్నడూ లేని విధంగా జగన్మోహన్‌రెడ్డి పాలనలో గ్రామంలో మరింత అభివృద్ధి జరిగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా విభేదాలు పక్కనపెట్టి గెలుపుకు కృషి చేయాలని అన్నారు. వైసిపి ఇన్చార్జి వరికుట్టి అశోక్ బాబుకు ప్రజలంతా అండగా ఉండి గెలుపుకు కృషి చేయాలని సూచించారు. అశోక్ బాబు గెలుపొందే అవకాశాలు పూర్తిగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, మండల ఉపాధ్యక్షులు కె పిచ్చయ్య శాస్త్రి, ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు, హేమ సుందదరావు పాల్గొన్నారు.


చేనేత పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున

చేనేత కార్మికులకు రాట్నాలు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు మంజూరైన మర రాట్నాలు, స్టాండ్ మగ్గాలను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని ఐలవరంలో ప్రభుత్వం నుండి మంజూరైన పరికరాలను 250మంది చేనేత కార్మికులకు మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు చేతుల మీదగా అందజేశారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ చేనేత రంగ అభివృద్ధికి జగన్మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ నుండి సిఎం జగన్మోహన్‌రెడ్డి వరకు చేనేతల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాలానికి అనుగుణంగా చేనేత కార్మికులు నూతన వస్త్ర తయారీ డిజైన్లపై మక్కువ చూపాలని అన్నారు. దీనిలో భాగంగానే మోటార్‌తో నడిచే రాట్నలు, స్టాండ్ మగ్గాలు అందజేశారు. జౌలి శాఖ ఆధ్వర్యంలో అందజేసిన పరికరాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు, బాపట్ల అభివృద్ధి కమిటి చైర్మన్ మల్లికార్జునరావు, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరావు, ఎంపీపీ డివి లలిత కుమారి, జెడ్పిటిసి ఉదయభాస్కరి, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు, హేమ సుందరావు పాల్గొన్నారు.


బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సిఐ శేషగిరిరావు

నేపాల్ బాలిక చీరాలలో అప్పగింత

ప్రజాశక్తి - చీరాల

బెంగళూరులో నివాసం ఉంటున్న నేపాల్‌కు చెందిన ప్రియా కుమారి (12) అనే బాలిక తన అత్తతో కలిసి విజయవాడలో ఉంటున్న బంధువులు వద్దకు రైలులో వెళు తుండగా మంచి నీటి కోసం చీరాల స్టేషన్‌లో రైలు దిగటంతో తప్పిపోయింది. ఆ బాలిక చీరాల చర్చి రోడ్డులో ఏడుస్తూ తిరుగుతోంది. అయితే విషయం గమనించిన లావణ్య ఫర్నీచర్ సిబ్బంది, స్థానికులు ఆమెను విచారించి ఒకటో పట్టణ సిఐ పి శేషగిరిరావుకు సమాచారం అందించారు. పోలీసులు ఆ బాలిక వద్ద నుండి వివరాలు సేకరించి బంధువులతో ఫోన్లో మాట్లాడి పిలిపించారు. బాలికను సురక్షితంగా అప్పగించారు. స్థానికుల సాయంతో పోలీసులు తమ బిడ్డను తమకు అప్పజెప్పడంతో బాలిక కుటుంబ సభ్యులు ఆనంద వ్యక్తం చేశారు.

బిహెచ్ఈఎల్‌కు బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఒంగోలు డిపో నుండి బీహెచ్ఈఎల్‌కు సూపర్ లగ్జరీ బస్సు నడపాలని ఒంగోలు రీజనల్ మేనేజరు సుధాకర్ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావును నెల్లూరు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదామ్ సాహెబ్ ఆదేశించారు. గతంలో ఒంగోలు నుండి నాగులుప్పలపాడు, రాచపూడి, దుద్దుకూరు, ఇంకొల్లు, పర్చూరు, చిలకలూరిపేట మీదగా నడిచే ఆగిపోవడంతో సమస్యపై అధికారుల దృష్టికి పలువురు ప్రయాణికులు తీసుకెళ్లారు. ఒంగోలులో రాత్రి 8గంటలకు బయలుదేరి ఇంకొల్లుకు 9గంటలకు చేరుతుంది. ఇంకొల్లు నుండి బయలుదేరి పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదగా బీహెచ్ఈఎల్‌కు చేరుతుంది. మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షులు అన్నంభొట్ల మోహన్ కృష్ణ శాస్త్రి కృతజ్ఞతలు తెలిపారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల, ప్రజాసంఘాల నేతలు

'ఎస్మా'ను ఉపసంహరించుకోవాలి

- అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి
- 16 నుంచి ప్రత్యక్ష పోరాటం ఉధృతం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 16 నుండి ప్రత్యక్ష పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరిని నిరసించాయి. తక్షణమే అంగన్వాడీలపై విధించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. అంగన్వాడీలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి సూచించాయి. సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కామేపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఒంగోలు నగర అధ్యక్షులు మలగా రమేష్, సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ,సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వి సుదర్శన్, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రఫీ ,ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం , కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి మాట్లాడారు. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని ఖండించారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య, పౌర సమాజం జిల్లా కన్వీనర్ జి.నరసింహారావు, ఒంగోలు పట్టణ అభివద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, ఆల్ రిటైర్డ్ పర్సన్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాంబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్, పిఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ ,ఏఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ ఎంఎస్ సాయి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు ,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.విజయ్, ఆవాజ్ ఒంగోలు నగర అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



జంకెని సత్కరిస్తున్న బూచేపల్లి

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో బూచేపల్లి ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన రెండో రోజూ అట్టహాసంగా జరిగింది. ఎడ్ల పందేలను మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ బూచేపల్లి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా చేయడం అభినందనీయమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దర్శి నుంచి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పోటీ చేస్తారని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన ప్రజలను మోసం చేస్తున్నాయని, వైసీపీని గెలవలేక వాళ్లు కుయుక్తులు పన్నుతూ బీజేపీని వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మంత్రి మేరుగ నాగార్జున పాల్గొని ఎడ్ల పందేల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రస్తుతం 17 జతల ఎడ్లు పాల్గొనగా 12 జతల ఎడ్లు పందేల్లో పాల్గొన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌కు చెందిన చత్రపతి భీమడోలు ఎడ్లు బలప్రదర్శనలో మొదటి స్థానంలో నిలిచాయి. 3905 అడుగులు లాగి మొదటిస్థానం సాధించాయి. ఈ సందర్భంగా మొదటి బహుమతిని రూ.2 లక్షలు, రెండో బహుమతి రూ.1.60 లక్షలు, మూడో రూ.1.25లక్షలు, నాల్గో బహుమతి రూ.లక్ష, ఐదో బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, ఎంపీపీ గోళ్ళపాటి సుధారాణి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, తూము సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

అంగట్లో 'ఆప్కాస్' ఉద్యోగాలు

- ఓఎంసిలో ఖాళీ పోస్టుల అమ్మకాలు
- ఇటీవలే 17 పోస్టులు అమ్ముకున్న వైనం
- మరో 30 పోస్టులు అమ్ముకొని సొమ్ము చేసుకునేందుకు రంగం సిద్ధం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)లో ఖాళీ అయిన పోస్టులను ఒంగోలు నగరపాలక సంస్థలో అమ్ముకుంటున్నారు. గడిచిన మూడు, నాలుగు మాసాల్లో ఖాళీ అయిన 17 పోస్టులను ఇటీవలే అమ్ముకున్న అధికారులు మరో 30 పోస్టులు అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్కో పోస్టు విలువ రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు పలుకుతోందని కార్పొరేషన్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఈ మొత్తం అమ్మకాల వ్యవహారంలో ఆయా సెక్షన్ హెడ్‌లతోపాటు ఉన్నతాధికారుల పాత్ర కీలకంగా ఉన్నట్లు సమాచారం. పోస్టులు అమ్ముకొని సొమ్ము చేసుకునేందుకు ఆప్కాస్‌కు జిల్లా స్థాయిలో చైర్మన్‌గా ఉన్న కలెక్టర్‌ను, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కూడా కార్పొరేషన్ అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని తెలిసింది.

ఒంగోలు నగరపాలక సంస్థ నుంచి ఆప్కాస్‌లో 916 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్ నుంచి 235 మంది, శానిటేషన్ విభాగం నుంచి 681 మంది పనిచేస్తున్నారు. వీరు కాకుండా అదనంగా ఒక్కరిని కూడా విధుల్లోకి తీసుకునే అధికారం నగరపాలక సంస్థ అధికారులకు లేదు. కానీ ఆ 916లో ఏమైనా ఖాళీలు వస్తే ఉన్నతాధికారుల అనుమతితో భర్తీ చేసుకునే అవకాశం మాత్రం ఉంది. ఈ అవకాశాన్నే అధికారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. గడిచిన మూడు, నాలుగు మాసాల కాలంలో ఆ 916లో కొన్ని ఖాళీలు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగంలో కొంతమంది చనిపోయారు. కొంతమందికి ప్రభుత్వం



విధించిన ఉద్యోగ కాలపరిమితి 62 సంవత్సరాలు నిండాయి. ఇలా ఆ రెండు కారణాలతో రెండు సెక్షన్‌లలో 17 పోస్టులు ఖాళీ అయ్యాయి. ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేసే వ్యవహారంలో అధికారులు వసూళ్లకు పాల్పడ్డారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో సుమారు రూ.అరకోటి వరకు చేతులు మారినట్లు తెలిసింది.

యూనియన్ల అభ్యర్ధనను పట్టించుకోలేదు..

ఆప్కాస్‌లో ఉద్యోగులుగా ఉండి, చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని, వయస్సు నిండి తొలగించిన వారి స్థానంలో కూడా వారి కుటుంబసభ్యులకే పనిచేసుకునే వెసులుబాటు కల్పించాలని మున్సిపల్ కార్మిక సంఘాలు గత అనేక సంవత్సరాల నుంచి కోరుతున్నాయి. అయితే అందుకు విరుద్ధంగా అధికారులు ఖాళీ పోస్టుల్లో వారికి అనుకూలమైన వారిని చేర్చి సొమ్ము చేసుకుంటున్నారు. అలా ఇటీవల ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాల్లో ఖాళీ అయిన 17 ఆప్కాస్ పోస్టులను కూడా అమ్ముకున్నారని కార్పొరేషన్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

మరో 30 మందికి ఎసరు.?

ఆప్కాస్‌లో ఖాళీ అయిన పోస్టులను అమ్ముకోవడం లాభసాటి వ్యవహారంగా ఉండటంతో మరో 30మందిని ఆప్కాస్ నుంచి తొలగించి వారి స్థానంలో వేరే వారిని చేర్చి సొమ్ముచేసుకునేందుకు అధికారులు జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ తతంగంలో సుమారు రూ.కోటి వరకు వసూళ్లు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

ఉన్నతాధికారులను పక్కదారి పట్టించారా.?

ఆప్కాస్‌లో కొత్తగా ఎవరి పేరు చేర్చాలన్నా ఆప్కాస్‌కు జిల్లా స్థాయిలో చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ ఆమోదం తప్పనిసరి. అలాగే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనుమతి కూడా తీసుకోవాలి. కొత్తగా ఆప్కాస్‌లో ఎవరినైనా తీసుకోవాలంటే వారికి సరైన కారణాలను చూపించాల్సి ఉంటుంది. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు సిఫార్సు చేశారని చెప్పి ఆప్కాస్‌లో ఖాళీ అయిన స్థానాలలో కొత్త వారిని చేర్చి సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. వాస్తవానికి స్థానిక ప్రజాప్రతినిధులు ఎలాంటి సిఫార్సు చేయకపోయినా చేసినట్లు కార్పొరేషన్ అధికారులు ఉన్నతాధికారులను పక్కదారి పట్టిస్తున్నారని తెలిసింది.

విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం..

జి.నాగరాజు, కార్మికరాజ్య బీమా సంస్థ సంక్షేమ సంఘం, జిల్లా అధ్యక్షులు

ఒంగోలు నగరపాలక సంస్థలో ఆప్కాస్ ఖాళీ ఉద్యోగాల అమ్మకాలపై మున్సిపల్ ఉన్నతాధికారులకు, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం. ఖాళీ స్థానాలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అలా కాకుండా కార్పొరేషన్ అధికారులు ఇష్టారీతిన అమ్ముకుంటున్నారు. ఇప్పటికే కొన్ని పోస్టులు అమ్ముకున్న అధికారులు, త్వరలో మరికొన్ని పోస్టులు భర్తీ చేసి అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. పోస్టుల పేరుతో వసూలు చేసిన డబ్బు తిరిగి ఇవ్వాలి. ఖాళీ పోస్టులను కార్మికుల కుటుంబసభ్యులకు కేటాయించాలి. లేదా అర్హతల ఆధారంగా, నిబంధనల ప్రకారం భర్తీ చేయాలి.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అంగన్వాడీలపై నిర్బంధాన్ని విడనాడాలి

ప్రజాసంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత నెల రోజులుగా వీరోచితంగా పోరాడుతున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బొమ్మతోటి రఘురాం, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. అంగన్‌వాడీల ఉద్యమానికి ప్రజా మద్దతు కూడగట్టేందుకు కరపత్రాలు వేసి విస్తతంగా ప్రచారం చేస్తున్నామని వారు తెలిపారు. ఆ కరపత్రాలను స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, ఐద్వా నాయకురాలు పొణకల రజిని పాల్గొన్నారు.

14న నగర స్థాయి ముగ్గుల పోటీలు

నిర్వహణ కమిటీ కన్వీనర్ దామా శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సంక్రాంతి పండుగ సందర్భంగా 35వ వార్డు అభివద్ధి కమిటీ లాయర్‌పేట ఆధ్వర్యంలో ఒంగోలు నగరస్థాయి ముగ్గుల పోటీలు ఉమామహేశ్వర జూనియర్ కాలేజీ వద్ద ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతాయని నిర్వహణ కమిటీ కన్వీనర్ దామా శ్రీనివాసులు, హరిబాబు, లక్ష్మినారాయణ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.6 వేల విలువైన వస్తువు, రెండో బహుమతి రూ.4 వేల విలువైన వస్తువు, మూడో బహుమతి రూ.3 వేల విలువైన వస్తువు, నాల్గో బహుమతి రూ.2 వేల విలువైన వస్తువు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు ఇస్తామన్నారు. పోటీలలో పాల్గొనే వారు ముగ్గు, రంగులు తెచ్చుకోవాలన్నారు. రంగుల ముగ్గులు మాత్రమే వేయాలని, ఒంగోలు నగరంలోని మహిళలు విరివిగా పాల్గొనాలని వారు కోరారు.